క్లుప్తంగా

బరక సంజీవరాయ స్వామికి గ్రామోత్సవం



మిడుతూరులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మిడుతూరు, పీరుసాహెబ్ పేట గ్రామాల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌లో ఆశీనులను చేసి పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామంలోని భక్తులు స్వామివార్లకు బియ్యం, బేడలు, బెల్లం, నగదు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, డాలు చిట్టిబాబు, మజ్జరి వెంకటేశ్వర్లు, అచారి, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల పండుగ సంక్రాంతి



బంగలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: సంక్రాంతి రైతులు జరుపుకునే పండుగ అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజనమ్మ, లక్ష్మన్న, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, దొరబాబు, వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా కల్యాణం



గోదా కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణంలో శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆలయంలో ఏచూరి సతీష్ కుమార్ దంపతులు, జేవై రమేష్ కుమార్ దంపతులు, బళ్లాని రామాంజనేయులు దంపతులచే పురోహితులు గోదా కల్యాణం, విశేష పూజలు నిర్వహించారు. భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

28న కోఆర్డినేషన్ సమావేశం



వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న ఆర్‌డీఓ విశ్వనాథ్

మహానంది: మహానందిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తొలి కోఆర్డినేషన్ సమావేశం ఈ నెల 28న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ ఆదేశించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆయన మహానందికి వచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. వేదాశీర్వచనం అనంతరం ఆలయ ఏఈఓ ఎరమల మధు మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆర్డీఓతో చర్చించారు.

నిత్యావసరాల అందజేత



బాధితులకు సరుకు అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: శిఖరం చెంచుగిరిజన గూడెంలో ఆదివారం రాత్రి రెండు గుడిసెలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. సోమవారం ఉదయం బాధిత కుటుంబాల వారికి శ్రీశైలం తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది నిత్యావసర వస్తువులు అందజేశారు. బియ్యం, కందిపప్పు, ఆయిల్‌తో పాటు, ఇతర నిత్యావసర సరుకులు, దుప్పట్లు, వంట సామగ్రి ఇచ్చారు. శ్రీశైలం ఐటీడీఏ ఏపీఓ సురేష్‌కుమార్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

మెల్విన్‌జోన్స్ జయంతి

నంద్యాల(వ్యవసాయం): అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు మెల్విన్‌జోన్స్ జయంతిని పురస్కరించుకొని సోమవారం నంద్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని సెయింట్ యాన్స్ మనోవికాస కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రవికృష్ణ, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

భోగభాగ్యాల భోగి

సాక్షినెట్‌వర్క్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుడమి పులకించే విధంగా రంవల్లులు వేశారు. భోగి మంటలను చిన్నారుల సైతం వాడవాడలో వెలిగించారు. ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు, రేగు పండ్లు పోసి ముగ్గులను అందాలుగా వేకుజామున నుంచి మహిళలు తీర్చిదిద్దే పన్నిలో మునిగిపోయారు. గ్రామాలలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. నువ్వులతో చేసిన సజ్జ, జొన్న రొట్టెలు, పిండివంటలు చేసుకొని బంధువులతో ఆరగించారు. ఉదయం నుంచి సాయంత్రం సూర్యాస్తమయం అయ్యేలోగా చిన్నారులకు భోగి పళ్లు వేసి ఆశీర్వదించారు. తరిగోపుల గ్రామంలో వెలసిన శ్రీఅనంతనాగేశ్వరస్వామి, శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి వార్లకు పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేషపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వెలుగోడు మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో అంకాల పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బుడ్డా శేషారెడ్డి ఆధ్వర్యంలో భోగి మంటల వేడుకలు వైభవంగా నిర్వహించారు.

ముగ్గుల పోటీలు

పాములపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయం ఆవరణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలోబీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మురళీమోహన్, వివేకానంద హైస్కూలు కరెస్పాండెంట్ గోపాల్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మురళి, భాస్కర్, జనసేన రాము తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

ఆత్మకూరు: పట్టణంలోని గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్, అర్బన్ కాలనీ, వీరభద్ర ఏరియా, గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్, గొల్లపేట తదితర కాలనీల్లో ఇటీవల విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో సోమవారం దహనం చేశారు. సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి రణధీర్, సురేంద్ర, రామ్‌నాయక్, సీపీఎం నాయకురాలు మంజుల, మీనాక్షమ్మ, వీరమ్మ, భాస్కర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆలయాలు ముస్తాబు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో సంక్రాంతి పర్వదినానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. గువ్వలకుంట్ల, దుద్యాల, నందికుంట, శివపురం, ఎర్రమఠం గ్రామాలలో ఆలయాలు విద్యుత్ దీపకాంతులతో కలకలలాడుతున్నాయి. కొత్తపల్లి మండల కేంద్రంలోని శ్రీ పార్వతీసమేత తాండవమల్లేశ్వర కళ్యాణమహోత్సవం సందర్భంగా తాండవమల్లేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఆలయంలో పుష్య శుద్ధ బహుళ పాడ్యమి ఉదయం స్వామివార్లకు బిందెసేవ, గణపతిపూజ, రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, సాయంకాలం ప్రదోష పూజ వంటి విశేష పూజకార్యక్రమాలు నిర్వహించారు.



వేల్పనూరులో భోగి మంటలను వెలిగిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బుడ్డా శేషారెడ్డి



మొదటి విజేత పార్వతికి బహుమతి అందిస్తున్న అతిథులు



నందికొట్కూరులో భోగి మంటలు వెలిగించిన యువకులు



కొత్తపల్లిలోని తాండవమల్లేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించిన దృశ్యం

పెద్దకొట్టాల వృషభాల జయకేతనం



మొదటి బహుమతి కైవసం చేసుకొన్న వృషభాలు

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీల్లో పెద్దకొట్టాల గ్రామానికి చెందిన వృషభాలు విజయకేతనం ఎగురవేశాయి. పోటీల్లో 10 జతల వృషభాలు పోటీపడగా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు అత్యధిక దూరం బండను లాగి మొదటిస్థానంలో నిలిచి రూ.50వేల నగదును గెలుచుకున్నాయి. కైరవాడికి చెందిన బి.లక్ష్మన్న ఎద్దులు ద్వితీయస్థానంలో రూ.40వేలు, ప్యాపిలి బి.శ్రీను ఎద్దులు తృతీయ స్థానంలో రూ.30వేలు దక్కించుకున్నాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు జయనాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, దొరబాబు, రామసుబ్బారెడ్డి, మండడి నారాయణరెడ్డి తదితరులు బహుమతులను అందజేశారు.

ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలి

నందికొట్కూరు: ప్రజలను నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి తగ్గిన బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ట్యాంకు ఏరియాలో, హాజీనగర్, బీఆర్‌ఆర్ నగర్, మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో భోగి మంటల్లో పెంచిన విద్యుత్ బిల్లులను ప్రజలు, సీపీఎం నాయకులు దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇష్టానుసారంగా పెంచడం తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు స్వాములు, వెంకటేశ్వర్లు, స్వామి నాయుడు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ చార్జీల బిల్లులను భోగి మంటల్లో దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

పాములపాడు: కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచడంపై నిరసనగా సోమవారం సీపీఎం నాయకులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి నిరసన తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి స్వామన్న, నాయకులు రమణమ్మ, రాజకుమార్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్‌లో సీపీఎం నాయకులు భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పార్టీ మండల కన్వీనర్ పక్కీర్ సాహెబ్, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుధాకర్, ఆంజనేయులు, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



చాగలమర్రి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో నగర సంకీర్తనకు హాజరైన ఆర్యవైశ్యులు

చాగలమర్రి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్యులు సోమవారం వేకువజాము నుంచే నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పూలేటి రాధాక్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట భోగి మంటలు వేశారు. రంగ వల్లులు, గొబ్బెమ్మలు పెట్టి భోగి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం పిల్లలపై తల్లిదండ్రులు, పెద్దలు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణబాబు, సభ్యులు నవత ప్రసాద్, లక్ష్మీనారాయణ, క్రిష్ణం ప్రసాద్, బాబు, ఆనంద్, నాగేంద్రప్రసాద్, మల్లికార్జున, బచ్చు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట భోగి మంటలు

గోదాదేవికి విశేష పూజలు



తిరుమంజన సేవలో కొలువైన ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం గోదాదేవి అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. వేకువజామున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదాదేవి నవకలశ భోగి తిరుమంజనం శాస్త్రోక్తంగా చేపట్టి రాత్రి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

నాట్యాచారుడికి నృత్యరత్న పురస్కారం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ పల్లంశెట్టి సురేష్ రాయలసీమ నృత్యరత్న పురస్కారం సోమవారం ప్రొద్దుటూరులో అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో రాయలసీమ సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా శ్రీనటరాజ కళాక్షేత్రం వ్యవస్థాపకులు పఠాన్ మొహిద్దీన్ ఖాన్ పురస్కారాన్ని అందజూశారని చెప్పారు.

పైపులైన్‌కు మరమ్మతులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో పైపులైన్‌కు సర్పంచు వరప్రసాద్ సోమవారం మరమ్మతులు చేయించారు. గ్రామంలోని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు వద్ద పైపు లైన్ లీకేజీ అవతుండటంతో గ్రామంలోకి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సంక్రాంతి పండుగ కావడంతో వెంటనే మరమ్మతులు చేయించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మిడుతూరు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఓబులేసు సోమవారం తెలిపారు. పీరుసాహెబ్ పేట గ్రామ శివారులో ఇసుక లోడ్‌తో వెళ్తుండగా స్వాధీనం చేసుకొని, నమోదు చేసినట్లు వెల్లడించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు: నాటుసారా స్థావరాలపై దాడులు చేసి సుమారు 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ ఎస్ఐ జఫరుల్లా సోమవారం తెలిపారు. పట్టణంలోని నీలి షికారి కాలనీలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి బెల్లంఊటతో పాటు బట్టీలను ధ్వంసం చేశామన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు కుమారి, శంకర్ నాయక్, పద్మనాభం, సుధీర్, శివన్న, రమీజా, శ్వేత పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో సోమవారం సాయంత్రం శ్రీలక్ష్మీదేవి అమ్మవారు, చెన్నకేశవస్వామి వారికి కల్యాణం జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పన్నీటిస్నానం ఆచరింపజేసి పట్టువస్త్రాలతో వధువు, వరునిగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు కళ్యాణవేదికపైకి చేర్చి అర్చకులు రామచంద్రయ్య, చంద్రశేఖరయ్య వేదమంత్రాలను పఠిస్తూ కళ్యాణక్రతువును జరిపించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దాం

కొత్తపల్లి: చదివిన పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక కృషి చేస్తామని పాఠశాల పూర్వపు విద్యార్థుల సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ మన్సూర్ బాషా, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని గోకవరం గ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థుల సేవా సమితి కమిటీ ఎన్నికను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సేవా సమితి కమిటీ అధ్యక్షులుగా ఆత్మకూరు ప్రముఖ వైద్యులు డాక్టర్ మన్సూర్ బాషా, ఉపాధ్యక్షులుగా పుల్యాల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కార్యదర్శిగా దినేష్ కుమార్, ట్రెజరర్‌గా వెంకటరమణ, గౌరవ సలహాదారునిగా వెంకటస్వామిలను ఎన్నుకున్నారు.

కోడిపందేలు, జూదానికి దూరంగా ఉండండి

శ్రీశైలం: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, జూదం వంటి క్రీడలకు దూరంగా ఉండాలని సీఐ ప్రసాదరావు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. దేహదారుఢ్యాన్ని పెంచే క్రికెట్ వాలీబాల్ రన్నింగ్ మేధస్సును పెంచే చెస్ లాంటి క్రీడల్లో నైపుణ్యం సాధిస్తే ఉన్నత స్థాయిలో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఎవరైనా యువకులు జూదం కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు చేపడితే దేవాదాయ చట్టపరంగానే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఉర్దూ పుస్తకావిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): ప్రముఖ ఉర్దూ రచయిత అబ్దుల్ అజీజ్ రచించిన ఉర్దూ పుస్తకం సునిహేరే సహాహత్ (గోల్డెన్ పేజీస్) పుస్తకాన్ని మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ సోమవారం ఆవిష్కరించారు. నౌమాన్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే రచనలు, పూర్వీకుల గత స్మృతులను నేటి తరానికి పరిచయం చేస్తూ అబ్దుల్ అజీజ్ కృషిని అభినందించారు. మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ తమీమ్, కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, అబ్దుల్‌సమ్మద్, డాక్టర్ అంజాద్, జునుల్లావుద్దీన్, ఫజులేరహిమాన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

కొత్తపల్లి: గ్రామాల సరిహద్దులో అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎం.కేశవ తెలిపారు. సోమవారం మండల కేంద్రం పరిసర ప్రాంతాలలో డ్రోన్ కెమెరాను ఉపయోగించి పరిసరాలని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ ఈ డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల శివారు ప్రాంతాల్లో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని తాండవమల్లేశ్వర స్వామి తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ, మండలంలో ఎలాంటి జూదాలు, పందేలు జరగకుండా చేసేందుకు పోలీసు శాఖ ఈ ప్రయోగం చేస్తుందన్నారు.



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్ఐ ఎం.కేశవ

బయట కిరాణం.. లోపల మద్యం విక్రయం



దుకాణం వద్ద మద్యంకోసం వేచివున్న మందుబాబులు

పగిద్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుని కనుసన్నల్లో అక్రమ మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. బయటకు మాత్రం కిరాణ దుకాణంలా పెట్టి లోపల మాత్రం బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమ మద్యం విక్రయిస్తున్నారు. అంతేకాకుండా ఫోన్‌లో ఆర్డర్ చేస్తే ముగ్గురు బాయ్స్ ద్వారా మోబైల్ సర్వీస్ చేసి రెండు చేతులా అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీనికి తోడు గ్రామంలో తిరుణాల ప్రారంభం కావడంతో కొత్త, పాత వ్యక్తులతో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే ప్రభుత్వ అనుమతి లేకుండా కొనసాగుతున్నా ఈ అక్రమ వ్యాపారాన్ని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జఫ్రుల్లాను సంప్రదించగా పడమర ప్రాతకోట గ్రామంలో మూడు రోజుల పాటు ఈవెంట్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసి రోజుకు రూ.3,500లు చెల్లించేలా చలానా తీశారని, దానిని ఉన్నతాధికారులకు పంపామని ఇంకా పర్మిషన్ రాలేదని తెలిపారు. తూర్పు ప్రాతకోటకు ఎలాంటి అనుమతులు లేవని ఎస్ఐ పేర్కొనడం గమనార్హం. అయినా గ్రామంలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగిస్తుండడం విశేషం.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి

శ్రీశైలం టెంపుల్: ఏటా భోగి మంటల కార్యక్రమం నిర్వహించి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వేకువజామున ప్రధాన ఆలయ మహాద్వారం ఎదురుగా గంగాధర మండపం వద్ద భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అర్చకస్వాములు పాల్గొన్నారు. వీరు ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. కార్యక్రమంలో స్వామివారి ఆలయ ప్రధానార్చకులు వీరయ్యస్వామి, పర్యవేక్షకులు ఎం.హరియనాయక్, సీఎస్ఓ మధుసూదన్‌రెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీశైలం ప్రధాన ఆలయం ముందు దేవస్థానం ఆధ్వర్యంలో భోగి మంటలు వేసిన దృశ్యం

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీశైలంప్రాజెక్ట్: ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ నూతన క్యాలెండర్‌ను సోమవారం సున్నిపెంటలో సీఐ జి.చంద్రబాబు, ఎస్ఐ బీవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీఐ చంద్రబాబు మాట్లాడుతూ యువజన సంఘాలు యువత భవిష్యత్ సాధనలో భాగస్వాములు కావాలని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బి.లక్ష్మయ్య పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వర స్వామి దర్శనార్థం వస్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయం భక్తజనంతో పోటెత్తింది. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వేలాది మంది భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతర దర్శనం ఏర్పాట్లు చేశారు. వేకువజాము నుంచి ప్రారంభమైన మహానందీశ్వరస్వామి దర్శనంలో విరామం లేకుండా రాత్రి 9.30 గంటల వరకు సాగింది. ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల విక్రయం, వసతి గృహాలు, ఇతర విభాగాల ద్వారా ఒకేరోజు సుమారు రూ. 15 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు ప్రాథమిక సమాచారం.